క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో గల మక్కేవారిపేట, ఈఎస్ఆర్ గార్డెన్, గోలివారి తోట బాపనయ్యనగర్, టిడ్కో నివాసాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు కారణంగా విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



తాడికొండ: తాడికొండ మండలం వడ్డమాను గ్రామంలో 16 మంది వలంటీర్లు ఆదివారం మూకుమ్మడి రాజీనామాలు సమర్పించారు. ప్రజా సేవ చేస్తున్న తమపై నిందలు మోపుతూ చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడంపై వారు మండిపడ్డారు. వృద్ధులు, దివ్యాంగులకు సేవ చేసేందుకు అవకాశం లేనపుడు పదవులు ఎందుకని మూకుమ్మడి రాజీనామాలు సమర్పించామని తెలిపారు. త్వరలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకొని మళ్లీ వలంటీర్లుగా చేరి రెట్టింపు సేవలందిస్తామన్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలు



మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి గుడి ఎదుటఉన్న కరాటే స్కూలులో కరాటే గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో ఎంఎంకే స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, పెదవడ్లపూడికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కరాటే శిక్షకులు నరసయ్య, గణేష్, జీకే శేఖర్, డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఫిరంగిపురం: అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన కె.రాంబాబు గతంలో గొర్రెలు పెంచుకునేవాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేదు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మరునాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడిఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన చంద్రిక



మంగళగిరి: ఈనెల 8వ తేదీ నుంచి 1 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలకు రాష్ట్రం తరఫున మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక ఎంపికయినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో చంద్రికను గుంటూరు జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ చంద్రిక 84 కేజీల విభాగంలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చంద్రిక పోటీలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని కోరుతూ అభినందించిన వారిలో అసోషియేషన్ ప్రతినిధులు కొమ్మకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని, మద్ది ప్రభాకర్, సకల సూర్యనారాయణ, సకల కోటేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, మంగళగిరి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల్లో లైలతుల్ ఖదర్ (బడీరాత్) వేడుకలను ముస్లింలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బడీరాత్ సందర్భంగా మసీదుల్లో ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.. ముస్లింలు రాత్రంతా అల్లాను స్మరిస్తూ ధ్యానించారు. పలు మసీదుల్లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. రంజాన్ మాసంలో ముస్లింలు తాము దాచుకున్న దాంట్లో పేదలను ఆదుకోవాలని అప్పుడే అల్లా కరుణిస్తాడని, ప్రతి ముస్లిం తప్పనిసరిగా సేవా భావం చాటాలని ఇమామ్‌లు తెలియజేశారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవండి

- టెంపుల్ హిల్ ఏకో పార్కును అభివృద్ధి చేశాం
- వైఎస్సార్ సీపీ హయాంలోనే మంగళగిరి–తాడేపల్లి నగరాభివృద్ధి
- వాకర్స్‌ని కలిసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, కిలారి రోశయ్య, లావణ్య



టెంపుల్ హిల్ ఏకోపార్కులో వాకర్స్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు, పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, మంగళగిరి అభ్యర్థి లావణ్య

మంగళగిరి: నగర ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా అభివృద్ధి చేసిన నాయకుడు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అని వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు కొనియాడారు. గతంలో ఎంతోమంది నాయకులు, అధికారులు చుట్టూ తిరిగినా ఒక్కరూ పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆర్కే తనే స్వయంగా పార్కు అభివృద్ధికి కృషి చేయడంతో పాటు విద్యుత్, నీటి సమస్యలు పరిష్కరించడంతో నగర ప్రజలకు టెంపుల్ హిల్ ఏకో పార్కు నందనవనంగా మారిందని పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్య, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు ఏకో పార్కును సందర్శించి వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగర ప్రజలకు అందమైన వాతావరణంలో వ్యాయామం, యోగా, వాకింగ్ చేసుకునేందుకు పచ్చదనంతో కూడిన పార్కును అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య, ఎంపి అభ్యర్థి కిలారు రోశయ్యలకు అండగా ఉండి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే పార్కును మరింత అభివృద్ధి పరుస్తామని భరోసానిచ్చారు. వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులతో పాటు వాకర్స్ అంతా లావణ్య విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు మురుగుడు సత్యం, కాండ్రు శివనాగేంద్రం, వాకర్స్ అసోషియేషన్ ప్రతినిధులు వీసం వెంకటేశ్వరరావు, పుప్పాల కోటేశ్వరరావు, రాజు, మంచాల విజయ రామ్మోహనరావు, రాచకొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన 100 కుటుంబాలు..

మంగళగిరి: పట్టణంలోని 27వ వార్డు మార్కండేయకాలనీలోని 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. వార్డులో జరిగిన సమావేశంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు తమ ఇళ్లు, స్థలాలు నిషేధిత జాబితా 22ఏ లో ఉండడంతో ఎంతో ఇబ్బందిపడ్డామన్నారు. వార్డులో అత్యధికంగా టీడీపీ నాయకులు కార్యకర్తలు నివాసముంటున్నా గత టీడీపీ ప్రభుత్వంలో పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే ఆర్కే చొరవతో తమ ఇళ్లు, స్థలాలను నిషేధిత జాబితానుంచి తొలగించి తమకు న్యాయం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండి లావణ్యను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కుల,మత, రాజకీయాలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తారన్నారు. ఎన్నో సంవత్సాలుగా ఇక్కడ నివసిస్తున్న వారు తమ ఆస్తులు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో ఆనందంగా ఉన్నారన్నారు. బలహీనవర్గాల్లో నాయకత్వాన్ని పెంపొందించి వారిని రాజకీయంగా అభివృద్ధి పరిచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ మహిళ లావణ్యకు సీటు కేటాయించారన్నారు. ప్రత్యేకంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరిలో పెత్తందారుడికి సామాన్యురాలికి యుద్ధం జరుగుతుందని నియోజకవర్గ ప్రజలంతా సామాన్యురాలైన లావణ్యను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక నాయకులు కుంచాల కృష్ణ కిషోర్, పల్లవు వెంకట్రావుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారిలో షేక్ ఆషా, షేక్ కైమా, షేక్ రహీమా, దామర్ల సులోచన, మౌనిక, వెంకటేశ్వర్లు, సుజాత, మేముల సుధ, షేక్ షారిఫాన్, గంగా, బత్తుల సరళ, బూరుసు సీతారావమ్మ, పల్లవు సంతోషం, తమ్మిశెట్టి కుమారి, తన్నీరు మల్లీశ్వరి, డేరంగుల వెంకటేశ్వర్లు కుటుంబాలున్నాయి. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, మహిళా నాయకురాలు ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు



మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేలా కృషి చేయాలని పలువురు ప్రతినిధులు కోరారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాలకు రెండు రోజుల పాటు నగర పరిధిలోని చినకాకాని హాయ్‌ల్యాండ్‌లో నిర్వహించిన అభ్యసన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, సేవా కార్యక్రమాలను ఎలా విస్తృతం చేయాలనే అంశాలపై వివరించారు. ప్రతినిధులు శరత్ చౌదరి, బీపీవీ రాజు, అన్నే రత్నప్రభాకర్, అందే రేవంత్, గాజుల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, అందే మురళి, నిరంజన్ గుప్తా, కేవీఎస్ ప్రకాశరావు, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాంచారమ్మ చెరువు వద్ద నుంచి లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య సోమవారం పట్టణంలోని దామర్ల నాంచారమ్మ చెరువు వద్ద నుంచి ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆదివారం తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగనన్నతోనే అన్నివర్గాల అభివృద్ధి

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- రాయపూడిలో ఇంటింటి ప్రచారం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

రాయపూడి(తాడికొండ): కులమతాలకు అతీతంగా అన్నివర్గాలు అభివృద్ధి చెందాలంటే జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. ఆదివారం తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పథకాలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలకు దిగి లేనిపోని ఆరోపణలు చేస్తూ కుటిల పన్నాగాలు పన్నుతున్నారని, వారి మాటలు విని ప్రజలు మరోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేరన్నారు. మీకు మంచి జరిగితేనే ఓటేయండని చెప్పే ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క జగనన్న మాత్రమేనని, గత 5 సంవత్సరాల్లో ప్రజలకు అందించిన పథకాలే శ్రీ రామరక్షగా రాబోయే ఎన్నికల్లో 175/175 సీట్లలో గెలిచి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బత్తుల కిషోర్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకట శివారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శృంగారపాటి సందీప్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ తుమ్మూరు రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు నాగేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు ఆలూరి శ్రీనివాసరావు, మున్నంగి కోటిరెడ్డి, వివిధ విభాగాల నాయకులు తుమ్మూరు ప్రసాదరెడ్డి, చనుమోలు రామారావు, పుట్టి సుబ్బారావు, మిక్కిలి సాల్మన్ రాజు, షేక్ జానీ బాషా, పుట్టా నాగరాజు, పసుపులేటి అనీల్, షేక్ రఫీ, కంభంపాటి శ్రీను, కొప్పుల ఆంద్రీయప్ప, ఆరేపల్లి జోజి తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ అండ

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుడు నారా లోకేష్ 2014–2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలపై దాడులు జరగలేదని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనార్టీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామనడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. గుంటూరులో నిర్వహించిన నారా హమారా కార్యక్రమంలో ఎనిమిది మంది ముస్లిం యువకులు మైనార్టీ మంత్రి లేని రాష్ట్రం అని, తమ సమస్యలపై తమ బాధను, డిమాండ్‌లను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తే న్యాయం జరుగుతుందని భావించి ప్లకార్డులు ప్రదర్శిస్తే, వారిని దేశద్రోహులుగా చిత్రీకరించి అక్రమ కేసు బనాయించి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ కేసులను ఉపసంహరించుకున్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. మైనార్టీలకు కల్పిస్తున్న 4 శాతం రిజర్వేషన్‌ను తెలుగు రాష్ట్రాల్లో సంపూర్ణంగా రద్దు చేస్తామని బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఇప్పటికే ప్రకటించారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి సముచిత స్థానం కల్పిస్తే, ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరో అడుగు ముందుకు వేసి అన్ని రంగాల్లో మైనార్టీలకు అండగా నిలుస్తున్నారని అన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

మంగళగిరి: పట్టణంలో 22వ వార్డు లక్ష్మీనృసింహ స్వామి కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యలు పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ముస్లింలకు ఇఫ్తారు విందు అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ముస్లింలు భారీగా పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఈద్గా గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ గడిచిన రెండువారాలుగా ప్రీమియర్ లీగ్ సీజన్–3 పోటీలు ఆదివారం ముగిసినట్లు తెలిపారు. ఫైనల్ పోటీల్లో యాంగ్రీ టైగర్స్ టీంపై రాయల్ ఫైటర్స్ టీం క్రీడాకారులు గెలుపొందారు. వారికి మాజీ సర్పంచ్ నాగుల్ మీరా షరీఫ్ రూ.10,116లు బహుమతి నగదు అందజేశారు. రన్నరప్ టీం సభ్యులకు రూ.5,116 నగదును సొసైటీ చైర్మన్ షేక్ ఖాజావలి అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పెదజానీ, బెస్ట్ బౌలర్‌గా రాణాలకు ఒక్కొక్కరికి రూ.1500 నగదును షేక్ ఇమాం ఖాజావలి అందజేశారు.

స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తినింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన స్ఫూర్తిప్రదాతలు పుస్తకం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మంచా విజయరామ్మోహన్‌రావు, బీవీడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రావి రంగారావు, డాక్టర్ మన్నవ సత్యనారాయణలు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయమోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

జనసేన బెదిరింపులకు భయపడేది లేదు

- 175 నియోజకవర్గాల్లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ పోటీ
- పార్టీ నాయకుడు డి.నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంగళగిరి: జనసేన బెదిరింపులకు భయపడేది లేదని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో పోటీచేస్తుందని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డి.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ గుర్తు బక్కెట్, జనసేన గుర్తు గ్లాసు ఒకేలా ఉన్నాయనే కారణంగా పోటీ నుంచి మా అభ్యర్థులను తొలగించాలని జనసేన నాయకులు విజయవాడ హోటల్‌కు పిలిపించి గన్‌తో బెదిరించి పది బి.ఫారాలు తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామని పోలీసులు చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల కమిషన్ స్పందించాలని కోరారు. నాయకులు డి.వెంకటేశ్వరరావు, జి.రామారావు, షేక్ బాషా, షేక్ మస్తాన్, సయ్యద్, ఎస్కే గబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

పోలకంపాడు పంట పొలాల్లో అగ్నిప్రమాదం

- భారీఎత్తున ఎగిసిపడిన మంటలు
- సకాలంలో స్పందించి ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పోలకంపాడులో పాత జాతీయ రహదారికి, గుంటూరు చానల్‌కు, ఉండవల్లి ఎస్సీ కాలనీ కరకట్టకు మధ్యలో ఉన్న పంట పొలాల్లో పంట వ్యర్థాలకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపుగా 10 ఎకరాల్లో కోసిన వరికంకుల మోళ్లు ఉండడం, చెత్తా చెదారం ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ముళ్ల పొదలకు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఉండవల్లి ఎస్సీకాలనీ కరకట్ట వెంబడి దేవాలయ భూముల్లో ఉన్న నివాసాలవైపు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని, సుమారు 4 ఎకరాల పొలంలో వ్యాపించిన మంటలను అదుపుచేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీఎత్తున మంటలతో పాటు పొగకూడా వ్యాపించడంతో స్థానికులు పొగకు, ఎండ తీవ్రకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

మహానాడు ఏరియాలో విస్తృత ప్రచారం నిర్వహించిన నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గం, గుంటూరు పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మురుగుడు లావణ్య, కిలారి రోశయ్యల విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. మహానాడు ప్రాంతంలో ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్ రాజు, జేసీఎస్ తాడేపల్లి పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి స్థానిక నాయకులతో కలసి మహానాడు రైల్వే బ్రిడ్జి దగ్గర నుంచి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలోనే మహానాడు ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రజలందరూ మరోసారి వైఎస్సార్ సీపీకి అవకాశం ఇచ్చి మురుగుడు లావణ్యను, కిలారిరోశయ్యను గెలిపించాలన్నారు. చిన్నబోతుల దుర్గారావు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, బత్తుల దాసు, బాలసాని అనీల్, జిల్లా సేవాదళ్ ప్రధాన కార్యదర్శి చిలుకోటి శ్రీనివాస మధు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి భూపతి కిషోర్ నాయుడు, స్థానిక సచివాలయ కన్వీనర్లు పల్లంటి ఈశ్వరి, సయ్యద్ సలాం, తారక్, భూపతి శివరామకృష్ణ, జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, మేకా వెంకట రెడ్డి, శివయ్య, గృహ సారథులు, బూత్ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన



వాక్యోపదేశం చేస్తున్న బాలఏసు దేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి

ఫిరంగిపురం: కారుణ్య జపం, క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన జరుగుతుందని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పునరుత్థానం తరువాత వచ్చే ఆదివారం దివ్యభారతి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ సిలువపై ఉన్న క్రీస్తును సైనికులు బల్లెముతో పక్కలో పొడిచినప్పుడు శరీరం నుంచి రక్తం, నీరు వచ్చిందని, రక్తం నీరుతో భక్తుల పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు. అదేవిధంగా ఒక వైపు చీకటి, ఒక వైపు వెలుగు ఎలా ఉంటుందో అదేవిధంగా దివ్యకారుణ్యం అనేది నిండి ఉంటుందని చెప్పారు. క్రైస్తవ సంఘం విధులు నాలుగు ఉన్నాయన్నారు. అవి అపోస్తులుల బోధ, సహవాసం, రొట్టె విరవడం, సంఘముగా కుటుంబం ప్రార్థనలు చేయడం ద్వారా శక్తి ఏర్పడుతుందని తెలిపారు. దానిలో బలం, ధైర్యం నిండి ఉంటాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రార్థనలో ఫాదర్ విలియమ్స్, సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

10న కళాదర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని శ్రేష్ఠ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 10న వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై 10న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ సంగీత విభావరిలు ఉంటాయని తెలిపారు. అనంతరం సినీ నటి శ్రీమణి, ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, డాక్టర్ షమ సుల్తానా, గాయని పి సుజాత, సాహితీవేత్త పచ్చిపులుసు సూర్యనారాయణ, నృత్య కళాకారిణి మహంకాళి నాగలక్ష్మిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కుమార్, శేఖర్, బాబూరావు, బి. రాజశేఖర్ పాల్గొన్నారు.

సేవ చేసేందుకే మీ ముందుకు వచ్చా..

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను అందించేందుకు మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని.. మీ ఆడపడుచుగా భావించి తనను ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మురుగుడు లావణ్య అన్నారు. ఆదివారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని పద్మశాలీ బజారులో భావనాఋషి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురుగుడు లావణ్య రాకను పురస్కరించుకుని పార్టీలకు అతీతంగా పద్మశాలీల బజారులో ఆమెను సాదరంగా ఆహ్వానించి మహిళలు హారతులిచ్చారు. అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగుడు లావణ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను మహిళలకు అందించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తోడ్పాటు ఇచ్చారన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఊహించని స్థాయిలో అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మురుగుడు లావణ్యను మనందరం గెలిపించాలని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కంటే వైఎస్సార్ సీపీ హయాంలోనే మంగళగిరి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, గతంలో అధికారంలో ఉన్న 5 సంవత్సరాల్లో నియోజకవర్గ అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారో ఆ నాయకులు చెబితే బాగుంటుందని, అలా చెప్పకుండా వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు వీటన్నింటిని గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ మండలం బోధనం గ్రామానికి చెందిన తోట భూమిక (24) గుంటూరు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ రామిరెడ్డితోటలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తలుపులు తీయకపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా, భూమిక అనుమానాస్పద స్థితిలో మృతిచెంది పడి ఉంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఫిరంగిపురంలో ఆత్మీయ సమ్మేళనం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని 6,7,8 వార్డుల్లోని ప్రజలతో వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె.చిన్నప్పరెడ్డి ఆదివారం తెలిపారు. ఈకార్యక్రమం సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామన్నారు.